

# ప్రేముడి

## - మంథా భానుమతి



### (గత సంచిక తరువాయి)

**"అత్తా! నువ్వు** ఇక్కడే పండుకో రాదా? రేత్రి భయం వేస్తోంది నాకు. పిల్లలైతే ఆళ్ళింటికే పోతన్నారు. ఎట్టుంటన్నారో.. అర్ధమే కాదు. ఇప్పట్నుంచీ ఇక్కడ్నే పడుకోబెట్టాల. అస్సలా ఇల్లెట్టుందో.. పోయి శుభ్రం చెయ్యాల."

"అట్టగే అమ్మాయ్! ఎక్కడైతే ఏంది? పిల్లలకి అలవాటైంది కదా.. అక్కడ్నే ఉండనిద్దాం. ఇయేళ్టికి కానీ ఇట్టా. టౌన్నించి ఎవుళ్ళో వచ్చి, అనాధ పిల్లల్ని ఆస్టల్లో ఏత్తారంట. ఎప్పుడో.. ఇవేల రేపట్లో వత్తారంట. పంపేద్దాం."

కృష్ణవేణి దెబ్బతిన్నట్టు చూసింది. అనాధ హాస్టలా? లైబ్రరీలో ఉన్న పుస్తకాల్లో రకరకాల కథలు చదివింది ఆ హాస్టళ్ళ గురించి. పురుగులన్నం, నీళ్ళ చారూ, వీపుకంటుకుపోయిన కడుపులూ, వెళ్ళుకొచ్చిన పక్కటెముకలూ.. అమ్మో! రాజు, నాంచారీ పుట్టినప్పట్నుంచీ కృష్ణవేణి ఒడిలోనే పెరిగారు. వాళ్ళమ్మ చేపలేటకెళ్తే అక్క పక్కనే పండు కొనే వాళ్ళు.

కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లు తుండగా వెళ్ళి పిల్లల పక్కలో పడుక్కుని, నాంచారి తల నిమురుత్తా ఆలోచనలో పడింది. 'ఊ.." అని మూలిగి, మరింత ముడుచుకుని పడుక్కుని నోట్లో వేలు పడేసి, నిద్దర్లోనే చప్పరించ సాగింది నాంచారి.

"ఏం చెయ్యాలి? అట్టా వదిలెయ్యటమేనా? ఇంకో మార్గం లేదా? అదే తన పక్కన పుట్టిన వాళ్ళైతే.. అస్సలా తలపే ఉండేది కాదు. పరాయమ్మ కన్న బిడ్డలు కదా! ఎవురడుగుతారు? ప్చ్.. లాభం లేదు. పొద్దు పొడిచిన కాడ్నించి ఎన్ని కుదుర్చుకోవాలి.. పిల్లల్ని పెంచటవంటే మాటలా? ఇంత చిన్న వయసులో ఎంత కష్టమొచ్చింది వీళ్ళకి? తనకే తాడూ బొంగరం లేకుండా పోయింది.." అట్లాగే కళ్ళు మూసుకుని రకరకాల ఆలోచనల్తో నిద్దర్లోకి జారుకుంది.

వెంకమ్మ గ్రహించింది కృష్ణవేణి బాధని. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? తనకి మాలిన ధర్మం ఎంత వరకూ సాగుతుంది? ఏందో.. ఈ లంక బతుకులు? అస్సల్కీ లంకనే ఊడ్చి తీసికెళ్ళకూడదూ ఆ కిట్టమ్మ.. అటు చావనియ్యదు.. ఇటు బతకనియ్యదు.

మళ్ళీ అంతలోనే చెంపలు వాయించుకుని దణ్ణం పెట్టుకుంది. నాలుగు వేళ్ళూ నోట్లోకెళ్తన్నాయంటే ఆ తల్లి దయే కద! ఒకప్పుడెంత కళకళ్ళాడుతూండేవీ.. ఈ లంకలో గ్రామాలు! తన చిన్నతనం కళ్ళ ముందు తిరుగుతున్నట్టే వుంది.

ఎక్కడ చూసినా.. కను చూపుమేర పచ్చని వరి పంట.. ఆనందంగా గాలికి ఊగుతూ పలకరించే కంకెలు.. పంటక్కావలసినప్పుడు పడే వానలు. పొలాల గట్ల వెంబడి పరుగెత్తుతుంటే కాలం తెలిసేదే కాదు. నాట్లెప్పుడెయ్యాల, కుప్ప ఎప్పుడు నూర్చాల, బస్తాలకెప్పుడెత్తాల, పట్నం తీస్కెళ్లటాన్కి నావలో చెయ్యాల్సిన ఏర్పాట్లు.. పొద్దు గూకులూ అవే మాటలు ఊరంతా!

"ఏవీ అవన్నీ.. ఏడ పోయినయ్యి? నారాయడు పట్టుకెళ్ళిపోయాడా తనతో.." కళ్ళనుంచి కారుతున్న నీటిని తుడుచుకుని, పై బొంతని కాళ్ళ మీదినుంచి కప్పుకుని కాళ్ళు ముడిచి పక్కకి తిరిగి పడుకుంది. నిద్దరొస్తేనా? గతం అంతా కళ్ళ ముందు తిరిగింది. ఎప్పటి మాట.. పదిహేనేళ్ళు దాటిపోలా? అయితేనేం.. నిన్న మొన్న జరిగినట్టుంది.

3

అప్పుడే.. వెంకట లక్ష్మికి పధ్నాలుగేళ్ళు నిండాయి. నాలుగిళ్ళవతలున్న బళ్ళో ఎనిమిదో క్లాసు వరకూ చదివింది. కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగారాలూ చెయ్యగలదు. పేపరు కాగితం ముక్క కనిపించిందంటే చదవకుండా వదలదు.

వెంకటలక్ష్మీ వాళ్ళుండేది ఒక మాదిరి టౌను. రెండు సినిమా హాళ్ళూ, ఒక బాంకూ, హోల్ సేల్ మార్కెట్టూ, ఒక గవర్నమెంటాసుపత్రీ, రెండు ప్రైవేటాసుపత్రులూ, బ్రాందీ షాపులు.. వగైరాలన్నీ ఉన్నాయి.

తండ్రీ, ఇద్దరన్నదమ్ములు.. ముగ్గురూ బెస్తవాళ్ళ దగ్గర చేపలు కొని మార్కెట్లో అమ్ముతారు. కాస్తంత ఉన్నవాళ్ళే. ఓ మాదిరి పెంకుటిల్లు, ఆనుకుని ఎకరం తోట ఉన్నాయి.

ఇంట్లో వాళ్ళు చదువు మానిపించేశాక, వంటా వార్పూ.. ఇంటి పనీ, బజారు పనీ.. అప్పుడప్పుడు స్నేహితురాళ్ళతో, ఇంట్లో వాళ్ళతో బెంచి టికెట్టో, నేల టికెట్టో కొని సినిమాలు చూడ్డం.. ఇవీ వెంకటలక్ష్మి చేసే పనులు. ఏదైనా బండపనుంటే.. వాళ్ళమ్మే చూసుకుంటుంది.

అప్పుడప్పుడే ఊహల్లో తేలిపోవడం తెలిసింది. బంధువులు కలిసినప్పుడు.. ఆడవాళ్ళు చేసుకునే వేళాకోళాలకి అర్థాలు తెలుస్తున్నాయి. పిల్లకి పెళ్ళీడొచ్చింది.. ఎప్పుడెప్పుడూ? ఊదరగొట్టేస్తున్నారు చుట్టాలు. వాళ్ళిళ్ళల్లో పదమూడు నిండకుండా చేసెయ్యాలి. అది రూలట.

“గాడిద గుడ్డేం కాదూ! మా ఇట్టం వచ్చినప్పుడు చేస్తాం.. ఈల్ల గోలేంటంటా!” నాయన చిందులేశాడు. ఇంటికి మాలక్ష్మి అని కూతురంటే ప్రాణం అతగాడికి.

“ఇది పని కాదు. బాగోదు. ఇంక మగపిల్లలక్కూడా సెయ్యాల..” పెళ్ళాం సర్ది చెప్పింది.

సరిగ్గా అప్పుడే నారాయడి సంబంధం వచ్చింది. మధ్యవర్తి తెగ పొగిడాడు అబ్బాయినీ, కుటుంబాన్నీ. పిల్లా పిల్లాడూ నచ్చుకున్నారు.. పెళ్ళైపోయింది.

నాలుగెకరాల మాగాణి భూముందని, లంకలో ఉన్నా, నావలో ప్రయాణం చెయ్యాల్సినా.. నూలపాలెంలో పిల్లనిచ్చారు. టౌన్నుంచి బస్సెక్కి, పడవలో రేవు దాటి, రెండు కిలోమీటర్లు నడిచి వెంకటలక్ష్మిని చూట్టానికొచ్చేవాడు తండ్రి. అయితే.. అత్తమామలు.. ఒక్కడే కొడుకవడంతో కోడల్ని కన్నబిడ్డలా చూసుకుంటారు. అది చాలు కదా, ఏ పుట్టింటి వాళ్ళకైనా!

“యెంకీ! ఏడున్నవే. ఊరు ఊరంతా సంబరాలు చేసుకుంటా ఉంటే ఒక్క దానివీ ఇంటి కాడేం చేత్తన్నా?” నారాయడు ఆమడకో అంగేసుకుంటూ వచ్చాడు. వాడి పెళ్ళైన రెణ్ణెళ్ళకే చేతికొచ్చింది పంట. అమ్మోరి జాతర బ్రహ్మాండంగా జరుగుతోంది. పాలెంలో పండగే పండగ.

వచ్చినవాడు వచ్చినట్లు గుమ్మం దగ్గరే నిలుచుండి పోయాడు.

వెంకటలక్ష్మి అప్పుడే స్నానం చేసి ఎర్రంచు ముదురాకుపచ్చ చీర కట్టి, జాకిట్టు ముడేసుకుంటోంది. కిటికీ తలుపులు వేసున్నా, తలుపు సందుల్లోంచి సూరీడు తన కిరణాల్ని లోపలికి పంపి, సరిగ్గా వెంకటలక్ష్మి మొహం మీద పడేస్తున్నాడు. బుగ్గల మీద అక్కడక్కడా నిలిచిన నీటి బిందువుల్లోంచి పరావర్తనం చెందిన కాంతులు ఇంద్ర ధనుస్సు రంగుల్ని వెదజల్లుతున్నాయి. జుట్టంతా పైకి లేపి నడి నెత్తిన ముడి వేసింది. రింగు రింగులు తిరిగిన వెంట్రుకలు నుదుటి మీద అల్లల్లాడుతున్నాయి

వింతకాంతులు వెదజల్లుతున్న వెంకటలక్ష్మిని చూస్తుంటే నారాయడుకి గొంతంతా ఎండిపోయినట్లయింది. తను వచ్చింది కూడా గమనించకుండా, దీక్షగా, కళ్ళు దించి కొసలు ముడేసుకుంటున్న వెంకి, అలికిడికి తలెత్తి చూసింది.. అమాయకంగా, కళ్ళు పెద్దవి చేసి.

“అబ్బ.. ఎంత ముద్దొస్తున్నావే యెంకీ! ఆలీశం చేసి మంచి పన్జేశా.. ఇంట్లో మనిద్దరవే.. ఇల్లు ఇల్లంతా మందే! వచ్చేత్తన్నా..” ఒక్క

ఉరుకులో ముందుకొచ్చాడు.

"అబ్బా! ఉండు మావా.. ఆలీశం అయిందని నువ్వే అంటన్నావుగా!" విడిపించుకుందామని మెలికలు తిరిగింది.

"మరేం గాదులేవే.. ఆ సంబరాల్లో మనల్ని అంత గమనిస్తారా ఏంది. యెల్డాం తీరుబడిగా.. అమ్మకి చెప్పొచ్చాలే."

వెంకి బుగ్గలు సిగ్గుతో ఎర్ర బడ్డాయి. కళ్ళ నిండా ప్రేమ నింపుకుని చూసింది నారాయడిని.

"ఎందుకే అంతిట్టం నేనంటే?" ఎదకి హత్తుకుని అడిగాడు.

"కల్లు గిల్లు తాక్కుండా నన్నింత చక్కంగా చూసుకుంటే ఇట్టం ఉండదా ఏంటి?"

ఒక్క సారి గతుక్కుమన్నాడు. సర్దుకుని, వీధి తలు గడియ పెట్టొచ్చి, చిరునవ్వు నవ్వుతూ వెంకి నుదుటి మీద చుంబించాడు నారాయదు. వారానికి మూడు సార్లైనా కల్లు లేపోతే ఊరకుండలేని నారాయదు అప్పుడే శపథం చేసేసుకున్నాడు. పెళ్ళిగాక ముందటి సంగతేమో కానీ.. ఇంక జన్మలో తాక్కూడదని ఆ క్షణంలోనే ఒట్టేసుకున్నాడు.

ఏకాంతం ఎంత ఆనందం ఇస్తుందో అప్పుడే అనుభవం అయింది ఇద్దరికీ. అమ్మా, నాన్నా తమ చేష్టల్ని చూస్తున్నారేమోననే భయంతో.. దొంగ చాటుగా, మొక్కుబడిగా చేసే సంసారానికీ, స్వేచ్ఛగా హద్దులే లేని శృంగారానికీ ఉన్న తేడా అప్పుడే తెలిసింది.

ఏదేమైనా దీనికో మార్గం చూడాలనుకున్నాడు నారాయదు.

ఒక గది, దానికానుకున్న వరండా, అందులోనే ఒక పక్క చిన్న వంటిల్లు ఉన్న పెంకుటిల్లది. నారాయడి తల్లీ తండ్రీ, రాత్రయ్యే సరికి, వరండాలో చాపలేసుకుంటారు. చీకటి పడగానే ఊరు ఊరంతా నిశ్శబ్దమై పోతుంది. పెళ్ళికి ముందు నారాయదు వరండాలో పడుక్కునే వాడు. చలికాలం వస్తే.. రెండు బొంతలు కప్పుకున్నా వణుకుతూ.. ఏ అర్ధ రాత్రికో నిద్రపోయే వాడు.

"ఏంది మావా అట్ట కూర్చున్నా?" మొహం కడుక్కుని, చీరా జాకెట్టూ మార్చుకుని వచ్చి అడిగింది వెంకటలక్ష్మి, దీర్ఘాలోచనలో ఉన్న నారాయడ్ని.

"ఏం నేదే.. ఇంక పదేను రోజుల్లో చలికాలం వస్తంది. అమ్మా, నాయన ఆ వరండాలో చల్లో పడుక్కోవాలి. మనక్కూడా కాస్త చాటు కావాలని ఇప్పుడే తెలిసింది. అదే.. ఏం జెయ్యాల్నా అని ఆలోచిత్తన్నా."

పెనిమిటి మాటలకి మల్లె మొగ్గలా ముడుచుకు పోయింది వెంకటలక్ష్మి.

"అట్టా ముడుచుకో మాకే! ముద్దొచ్చేత్తన్నావు..మనం సంబరాలకెల్లాలి.. అసలే.. ఆలీశం.." దగ్గరగా రాబోతున్న నారాయడ్ని తప్పించుకుని తలుపు గడియ తీసి వీధిలోకి పారిపోయింది వెంకటలక్ష్మి.

"సర్సరే. అట్టనే చేద్దాం. రేపే నాగాయలంకెళ్ళి ఇటికలయ్యీ రేట్లు కనుక్కొన్నా. నాదొక్కటే బాధ. ఈ సారి పంటలో కాసిని దబ్బులు మిగిలినయ్యని ఖరుసెట్టేస్తే.. ముందు ముందు ఏదైనా అవుసరం పడితే ఎట్టా అని.." మల్లయ్య, నారాయడి తండ్రి పుగాకాడ సాపు చేస్తూ అన్నాడు. రోజుకి నాలుగు చుట్టలైనా కాల్చందే ఉండలేదు అతదు.

"రెక్కలు బలంగా ఉన్నంత సేపూ మనకేం బయ్యం నాన్నా! షావుకారు దగ్గర దాచి పెట్టిన డబ్బు కూడ తీద్దాం. పక్కాగా ఒక గదేసుకుందాం. హాయిగా ఉందాం."

ఐదారు రోజుల బట్టీ తండ్రికీ కొడుక్కీ అదే వివాదం నడుస్తోంది. రేప్పొద్దున్న పిల్లా పాప వస్తే ఎట్టా అని పెద్దతనికి దిగులు. వచ్చే ఖర్చే కానీ ఆగే ఖర్చు కాదు కదా! ఏటికి సరిపొయ్యే బియ్యం బస్తాలకెత్తి దాచి పెట్టుకున్నారు. కొంత ధాన్యం మార్చి పప్పులు ఉప్పులూ కొనుక్కున్నారు. రోజు వారీకి, రాత్రి పట్టే చేపలు ఆదుకుంటాయి. కాయా కసరూ దొడ్లో కాస్తానే ఉంటాయి. అయినా.. ఏంటో గుబులు

గుండెల్లో!

"పోనియ్యరాదయ్య! ఆళ్ళ సుకం కంటే మనకేం కావాల?" జాలమ్మ, నారాయడి తల్లి నేల మీద ముగ్గులు పెడుతూ అంది. అంతకు ముందే మట్టి నేలంతా శుభ్రంగా అలికింది వెంకట లక్ష్మి.

"మేస్త్రిని అట్టుకొచ్చి ఎట్ట చెయ్యాలో కనుక్కుంటే సరిపోద్ది. నేనూ, వెంకీ కలిపి యేసేత్తాం, గోడలూ, వాసాలూ.. కూలి ఖర్సుండదు." ఆశగా చూస్తూ అన్నాడు నారాయడు. నాయన ఒప్పుకుంటే బాగుండు.

"ఆ.. ఆ సుట్ట ఖరుసు తగ్గిత్తే నాలుగ్గదులేసుకోవచ్చు." మూతి తిప్పుతో అంది జాలమ్మ.

"నీకెంతసేపూ నా సుట్టల గోలేనే.. ఈ పాటి సుకం లేపోతే.. ఒల్లు నొప్పులు పోతయ్యా.. నడ్డొంగుద్దా నాలుగు నూకలొత్తయ్యా! ఆ ట్రంకుపెట్టి తీసుకరారా నారాయడా!" చుట్ట అంటించి, గోడ కానుకుని అర్ధ నిమీలిత నేత్రుడయ్యి అన్నాడు మల్లయ్య.

హుషారుగా వెళ్ళి, ట్రంకు పెట్టెని చులాగ్గా లేపి తీసుకొచ్చాడు నారాయడు.

ట్రంకుపెట్టె గొళ్ళానికి కట్టిన ట్వైను దారం ముళ్ళు విప్పబోయాడు పెద్దాయన. కన్ను సరిగ్గా ఆనలేదు. వేళ్ళు కూడా బండబండగా ఉండి స్వాధీనంలోకి రాలేదు. పొలం దున్ని, మట్టి పిసికి మొద్దు బారిపోయాయి.

వెంకటలక్ష్మి పక్కన కూర్చుని తన నాజూకు వేళ్ళతో, పిన్నీసు వాడి రెండు నిముషాల్లో తీసేసింది. అంతలో నారాయడు బ్లేడు పట్టుకొచ్చాడు.. కత్తిరించి పడేటానికి.

"ఓరి ఓరి.. నా కోడలు ఎంత నేర్పర్రా.. నువ్వూ ఉన్నావు ఎందుకూ!" వెంకటలక్ష్మిని ఆప్యాయంగా చూస్తూ అన్నాడు మల్లయ్య.

"ఓసోసి.. మురిపెం. నా ఏళ్ళంత సన్నంగుంటే దుక్కి దున్ని, తవుడు కలిపి, గొడ్లకి స్నానాలు చేపించి.. ధాన్యం బస్తాల కెక్కించి పన్లన్నీ చేసినట్టే. ఐనా నాకు తెలీకడగతా డబ్బులన్నీ తీసేస్తే.. ఇంకా పెట్టికి ముళ్ళెందుకంట. ఆ దారం ఎందుకంట!" నారాయడు బుంగమూతి పెట్టాడు.

పెద్దామె అందర్నీ నవ్వుతూ చూస్తోంది. అణకువ కలిగిన కోడలు దొరకటం నిజంగా ఎంతదురుష్టమో!

"రెండేలున్నయ్యిరా! షావుకార్దగ్గర మరో ఐదుంటయ్యి. అందుట్టోనే సరుదుకోవాల."

"అట్టగట్టగే!" డబ్బు లెక్కపెట్టుకుని పెళ్ళాన్నోసారి చూసి, తలాడించి బైటికెళ్ళాడు నారాయడు. పెట్టి సర్దేసి, మూలకి పెట్టి దొడ్లో కెళ్ళింది వెంకటలక్ష్మి.

పెద్దవాళ్ళిద్దరూ ఒకర్నొకరు చూసుకుని కళ్ళతో సంజ్ఞలు చేసుకుని ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

ఇంటి చుట్టూతా తిరిగి వెనక్కి వెళ్ళి, సొరపాదు కున్న ఎండు ఆకుల్ని తుంచుతున్న వెంకటలక్ష్మి కొంగు పట్టుకున్నాడు నారాయడు.

"అమ్మో.. అత్తొస్తుందేమో! ఆగు. ముందెళ్ళి పన్చూడు." గిర్రున తిరిగి, తలెత్తి నారాయడి కేసి కవ్విస్తున్నట్టుగా చూసింది.

"ఇంక మనకి ఎవరో వస్తున్నారేమో అనే భయం ఉండదు.." మెత్తని వెంకటలక్ష్మి బుగ్గని తన గరుకు మొహంతో రాస్తూ, చెవిలో అన్నాడు గుసగుసగా! చేత్తో నెమ్మదిగా మొగుడి మొహం తప్పించి ఇంట్లోకి తుర్రుమంది వెంకటలక్ష్మి.

తేలికైన మనసుతో, శరీరంతో.. గాల్లో తేలిపోతున్నట్టుగా నాగాయలంక బయల్దేరాడు నారాయడు. షావుకారు ఐదువేలకీ మరో రెండు వేలు కలిపి ఇచ్చాడు, వడ్డీ కింద.

మేస్త్రీ కూడా ఇటికలు, సిమెంటు అమ్మేదగ్గరే ఉంటాడు. పాలెంలో ఏం కట్టాల్సి వచ్చినా అతడే.

పడవలో వెళ్తున్నంత సేపూ ఊగుతున్న పడవలాగే ఉల్లాసంగా, హుషారుగా కూనిరాగం తీస్తూ ఉన్నాడు నారాయడు. తను

కట్టబోయే గది గురించే ఆలోచిస్తూ.

"అన్ని రేట్లూ పెరిగిపోయినయ్యి నారాయుడూ! తొమ్మిదేలంటే గోడలేచే వరకూ వస్తయ్యేమో. ఆ పైన పెంకులంటే.. ఇంకా కొంచెంలో కొంచెం రెండేలన్నా.." మేస్త్రి చప్పరించేశాడు.

"బాబ్బాబు.. మంచోడివి కదూ! కూలోళ్ళక్కర్లా.. మావే చేస్కుంటాం. మరో మాట చెప్పెయ్యబ్బయ్యా!"

"సర్లే.. గది సైజు తగ్గించేద్దాం. పైన రెల్లు పరిస్తే సరిపోద్ది." మేస్త్రీ ఆలోచిస్తూ అన్నాడు.

"రెల్లంటే మరి అగ్గి ముట్టుద్ది కదా! ఎట్టా కాచుకోవాల? ఇంకో ఉపాయం లేదా?" నీరు కారిపోతూ అడిగాడు నారాయుడు.

"రేకుల షెడ్డేసుకోవచ్చు. వాన పడుతే మాత్రం రణగొణ ధ్వనే."

"అంతే కదా! ఇంట్లోకయితే వాన రాదు కదా! ఇంకేంది మరి.. అట్టాగే చేసేద్దాం" రెట్టించిన ఉత్సాహంతో సరుకులన్నీ మాట్లాడి డబ్బిచ్చేశాడు.

"నాలుగైదు రోజుల్లో పట్టుకొస్తా. వచ్చి పునాది లోతులూ అవీ లెక్కలు చెప్తా. గోతులు తవ్వాక గోడలు మొదలుపెట్టేయ్యచ్చు."

"ఇప్పుడు నాతో వచ్చెయ్యరాదన్నా! సరుకు ఆనిక్కి పంపచ్చు. ముందు మేం తవ్వకం మొదలుపెడ్తాం. కావసిన పలుగులు, పారలు చెప్తే.." నెత్తి గోక్కున్నాడు. మరి వాటికి మాత్రం డబ్బులేవీ. మొత్తం మేస్త్రి కిచ్చేశాడు. కొద్దిగా చేతికిందుంచుకుని

"అవన్నీ నేనే ఇస్తాలే. ఒక గంటాగావంటే వెళ్దాం. మరీ ఆత్రంగా ఉన్నట్టున్నావు కదా!" చిరునవ్వు నవ్వాడు మేస్త్రీ.

"లేదన్నా! వచ్చేది శీతాకాలం కదా! అమ్మా నాయనా లోన పండుకోమంటే ఇనరు. బైట పంచలో చలి వణికెత్తించేత్తాది. అందుకే.. ఏమైతే అయిందని ఉన్నదంతా ఊడ్చి తీసకచ్చా! నీదే భారం."

"సర్సరే.. నీకేదైనా పనుంటే పోయిరా. మాపటేల్లోపు పోదాం. రాత్రికి మా బామ్మరిదింట్లో, మీ ఊళ్ళోనే.. ఉండిపోతా. పొద్దు పొడవగానే పని మొదలెట్టేద్దాం."

నారాయుడు సంచీ నడుంలో దోపి బయల్దేరాడు. కాస్త మిఠాయి, కొబ్బరికాయ, పూలు కొనుక్కెళ్దామని.

నారాయుడు నడుస్తూ ఆలోచిస్తున్నాడు. ఏంటో ఉన్నదంతా ఊడిచి పెట్టడం మంచిదేనా.. ఏదైనా అవుసరం పడితే అప్పుడేం చెయ్యాల? మనసొక పక్కకి, మెదడింకో పక్కకీ లాగేస్తున్నాయి.

వెంకటలక్ష్మితో ఏకాంతంగా, ఎంత హాయి.. తల్చుకుంటేనే ఒంట్లోంచి ఆవిర్లొస్తున్నాయి. ఛీ.. యెదవ జలమ. యెంత కాడికీ పైసా పైసా లెక్కెట్టుకోడవే. పోతే పోయింది. షావుకారి పొలంలో రెండుగంటలు పన్చేసి దాచేద్దాం. ముందు ఇప్పటి సుకం.." గట్టి నిర్ణయానికి వచ్చిన నారాయుడు, బజారు కేసి నడిచాడు.

"ఏందిరో హుషారు. మొహవట్టా యెలిగిపోతాంది. ఎక్కడన్నా లాటరీ తగిలిందా?" దారిలో ఒక స్నేహితుడి వాకబు.. నారాయుడ్ని కలల లోకం లోంచి కిందికి దించింది.

"మనకట్టాంటియ్యేం వద్దురా! కిట్టమ్మ తల్లి చల్లగ చూస్తే చాలు. ఇల్లు ఇరుకయిందనీ పక్కనో వాసం దించుతున్నాం. అందుకే పని బడొచ్చా. అట్టా పోయి టీ చుక్కలు తాగొద్దాం, వస్తా?" టీ బండి చూపించాడు నారాయుడు.

"ఈ ఏడు పంట డబ్బులు బాగా చేతికొచ్చినయ్యిరా! చాలా ఆనందంగుంది. మా యావిడకి అడ్డిక చేయిద్దామనుకుంటన్నా. అదీ.. మా అమ్మకి చెప్పకుండా.. పుట్టింటారిచ్చారని డ్రామా కట్టాలి. ఏందో యెదవ బతుకులు.. ఈ అత్తా కోడళ్ళు ఎంతకాలమైనా ఇట్టాగే యుద్ధాలు చేస్కోవలసిందేనా? ఓ శుభం లేదు.. ఓ పండగ లేదు. మంచి లేదు చెడు లేదు." స్నేహితుడు వాపోయాడు.

"ఔనవును. ఆ లచ్చిమీ సరస్వతులకే తప్పలేదు. మనవెంత.." వెంకటలక్ష్మీ, తన తల్లీ స్నేహితుల్లా, తల్లీ కూతుళ్ళల్లా కలిసిపోవడం అదృష్టం అనుకుంటూ.. మనసులోనే దుర్గమ్మ తల్లికి దణ్ణవెట్టుకున్నాడు నారాయుడు.

"లచిమీ సరస్వతులా.. అదేదో నా బోటోడే కాగితాలుచ్చుకుని కతల్రాశాడు. నేక పోతే.. ఆళ్ళకేం పన్లేదా పోట్లాడుకోడానికి. పైగా ఇద్దరూ ఎవరింటో ఆళ్ళుంటారు." స్నేహితుడు పడీ పడీ నవ్వాడు.

నారాయుడిక్కూడా నవ్వొచ్చింది. నిజవే కదా మరి! ఒకామె భర్త బొమ్మలు చేస్తుంటే పక్కనే వీణ వాయిస్తూ కూచుంటుంది. ఇంకొకామె పామ్మీద పడుకున్న పెనిమిటి కాళ్ళొత్తుతూ ఉంటుంది. వాళ్ళు కలిసేదెప్పుడు.. పోట్లాడుకునేదెప్పుడు!

"నీకు తెలుసారా. చేపల చెరువులనీ ఉంటయ్యంట. అందుట్లో రొయ్యల్నీ, చేపల్నీ పెంచుతారంట. ఓ్రెండేళ్ళల్లో లచ్చాదికారులైపోవచ్చంటన్నారు. నాగాయలంక చుట్టుపక్కలంతా అదే మాటలు. కొందరు పొలాల్ని చెరువుల కింద మార్చేస్తన్నారు." స్నేహితుడు చెప్పాడు.

"ధూ.. అట్టాంటి పన్చేసి నేల తల్లిని తవ్వేస్తారేందిరా! మాగాణి పంట దారి మాగాణిదే. వణ్ణం మానేసి రొయ్యలు, చేపలూ తినగల్రా ఎవ్వరైనా?" నారాయుడికి కోపం నసాళం అంటింది.

"రెండు టీ.. ఓ చెంచా పందార ఎక్కువెయ్యి.." బుల్లి బుల్లి గాజుగ్లాసుల్లో టీ ఇచ్చాడు కొట్టువాడు.

"ఇవేందిరా.. రోజు రోజుకీ చిన్నగై పోతన్నయ్యి, ఉగ్గుగిన్నెలో కొంచెం ఎక్కువే పట్టుద్ది." నారాయుడు కొట్టు వాడితో తగవేసుకున్నాడు.

"అంతేనండి. ధరలు పెరిగిపోతన్నయ్యి. టీ రేటు అంతే ఉండాలంటే మరి గ్లాసులు చిన్నవి సెయ్యాలి. ఏం చేత్తాం.." టీ బడ్డీ కుర్రాడు నవ్వుతూ అన్నాడు.

"ఈ సేపల సెరువుల కతేందిరా? కిట్టమ్మ ఇస్తానే ఉంది కదా తినగలిగినన్ని. ఇంకా భూదేవిని పొడవాలా సెప్పు?" నారాయుడు స్నేహితుడిని అడిగాడు.

"చేపల చెరువులంటే..ఎక్కువగా రొయ్యలన్నమాట. ఆ రొయ్యలకి మాంచి గిరాకీ నంట. ఎక్స్పోర్టింగ్ చేసేత్తారు. గుత్త దార్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. బాంకులోళ్ళు అప్పులిస్తారు. అవి కూడ వాళ్ళే అరేంజ్మెంట్ సేత్తారు. ప్లానింగెయ్యటం.. సీడింగ్లు తేటం.. అంతా ఆళ్ళే నేర్పిత్తారంట. మొదటేడాది.. ఒక్క సారో చూపు చూశావంటే మరుసటేడు నించీ మనవే చూసుకోవచ్చు. ముందో ఎకరాలో ఏసి చూత్తే ఎట్టుంటాదా అని.."

"ఏమోరా.. నేనేం చెప్పలేను. ఇప్పటికైతే భూదేవి తల్లి కడుపులు నింపుతా ఉంది. రేపటి సంగతా.. ఎప్పుడేం జరుగుతుందో ఎవ్వరు చెప్పగల్రా! ఆ దుర్గమ్మ, ఈ కిట్టమ్మ ఏవాలోసిత్తన్నారో?" ఉన్నట్టుండి నారాయుడిలో నిస్సత్తువ ఆవహించింది.

ఉన్న డబ్బంతా పెట్టి గది వెయ్యటం మంచి పనేనా.. అయితే వెంకటలక్ష్మి వాలు చూపులు కంటి ముందు మెదలి.. ఒంట్లోకి కొత్త రక్తం చేరినట్టే అనిపించింది. హుషారుగా తలెగరేశాడు.

"సరేరా.. ఏదైనా అవుసరం పడితే చెప్పు. కూలీలు గానీ కావాలంటే మా ఓళ్ళిద్దరున్నారు."

"అట్టగే చెప్తా." తలూపాడు నారాయుడు. పంటల పనయింది. మళ్ళీ నారేసే వరకూ అందరూ ఖాళీనే. ఎక్కడ నాలుగు డబ్బులొస్తయ్యా అని చూస్తుంటారు.

ఇద్దరూ టీ తాగి ఎవరి డబ్బు వాళ్ళిచ్చుకున్నారు. అటువంటివి అక్కడ మామూలే. కష్ట సుఖాలు తెలిసిన వాళ్ళు.. సహజంగానే ఇంకొకరికి భారం అవకూడదని నిర్ణయించుకున్నారు.. ఒకరికొకరు చెప్పుకోకుండానే.

టీ గ్లాసులు బడ్డీ కింద పెట్టేసి చెరో దిక్కుకీ వెళ్ళిపోయారు ఇద్దరూ!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments